క్లుప్తంగా

రోడ్డుకు అడ్డంగా దుకాణాలు



రోడ్డుకు అడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న సిమెంట్ మిక్సింగ్ వాహనం

రొద్దం: మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. పావగడ–పెనుకొండ ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపారులు రోడ్డుకు అడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో వాహదారులు ఇబ్బందులు పడుతున్నారు. బూచెర్ల వైపు వెళ్లే ప్రధాన రహదారికి అడ్డంగా పలువురు వ్యాపారులు రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని వాహన డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించాలని కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



చెక్కు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాలప్ప

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం సమీపంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి కంచిసముద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాలప్ప రూ. 30 వేలు విరాళమిచ్చారు. ఈమేరకు ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందించారు. మామిడిమాకులపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరామిరెడ్డి, కంచిసముద్రం మాజీ సర్పంచ్ నాగలింగారెడ్డి చెరో ట్రాక్టర్ సిమెంటు లోడు ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే బయన్నపల్లికి చెందిన రవి రూ. 5 వేలు విరాళంగా అందించారు.

నేడు నాగుల విగ్రహాల ప్రతిష్ట



నాగుల విగ్రహాలను ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని షిరిడీనగర్‌లో సోమవారం నాగుల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాలనీ వాసులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం నాగులను ఎద్దుల బండిలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. నాగుల ప్రతిష్ట సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు గురుస్వామి హనుమంతు తెలిపారు.

హైదరాబాద్‌కు బస్సు సర్వీసు ప్రారంభం



నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న అధికారులు

గోరంట్ల: మండల కేంద్రమైన గోరంట్ల నుంచి హైదరబాద్‌కు ఆర్టీసీ అధికారులు ఆదివారం సాయంత్రం నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. రోజూ సాయంత్రం 7.30 గంటలకు గోరంట్ల నుంచి హైదరాబాద్‌కు బస్సు బయలు దేరుతుందని పెనుకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ రామచంద్రయ్య తెలిపారు. మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ చేరుకుంటుందన్నారు. అలాగే హైదరాబాద్‌లో ఉదయం 8.45 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 8.45 గంటలకు బస్సు గోరంట్లకు చేరుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీపీటీఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు చరిత్రాత్మకం



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పావగడ: భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు విద్యా సహాయ ధనాన్ని వెంటనే విడుదల చేయాలని కర్ణాటక హైకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును స్వాగతిస్తూ స్థానిక భవన నిర్మాణ కార్మికుల పిల్లలు విజయోత్సవ ర్యాలీని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శని మహాత్మ సర్కిల్‌లో నిర్వహించిన సభలో స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు రామాంజినప్ప మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల పిల్లల చదువుకు సంబంధించి విద్యార్థి సహాయ ధనం వెంటనే విడుదల చేయాలని కర్ణాటక హై కోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఆ సంఘం కార్యదర్శి రామాంజి, ట్రెజరర్ మమత, హమాలి సంఘం అధ్యక్షుడు మద్దిలేటప్ప పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

- ఇష్టానుసారంగా రోడ్డు పనులు
- కొన్నిచోట్ల ప్యాచ్ వర్కులు, మరికొన్ని చోట్ల నూతన రోడ్ల పేరుతో దోపిడీ
- అన్ని పనుల్లో నాణ్యతకు తిలోదకాలు
- కొన్ని ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నా పట్టించుకోని వైనం

హిందూపురం/చిలమత్తూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అభివృద్ధి పనుల పేరుతో తమ్ముళ్లు దోపిడీ పర్వానికి తెరలేపారు. ముఖ్యంగా హిందూపురం నియోజకవర్గంలో హిందూపురం పట్టణంతో పాటు చిలమత్తూరు, లేపాక్షి మండలాల్లో ప్యాచ్ వర్కులు చేపట్టారు. అయితే వాటిని కూడా నాసిరకంగా చేపట్టి జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల నూతన రోడ్ల పేరుతో నిర్మాణాలు చేపడుతున్నా అందులోనూ నొక్కుడు కార్యక్రమం చేస్తున్నారు.



ప్యాచ్ వర్క్‌కు నోచుకోని కంచి సముద్రం రోడ్డు



చిలమత్తూరు: నాణ్యతలేని బీటీ రోడ్డు

రోడ్లన్నీ నాసిరకమే..

కూటమి నేతలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారన్న విమర్శలున్నాయి. అభివృద్ధి అంటూ భజన చేసే బ్యాచ్‌కు ఎమ్మెల్యే బాలకృష్ణ రోడ్డు నిర్మాణాలకు అవకాశం కల్పించారన్న చర్చ జరుగుతోంది. ఆయన స్థానికంగా ఉండరు కాబట్టి ఇవ్వాల్సిన వారికి మామూళ్లు ఇచ్చి నాసిరకంగా రోడ్లను నిర్మిస్తూ మమ అనిపించేస్తున్నారని చెబుతున్నారు. పలు చోట్ల సీసీ రోడ్లు నిర్మిస్తున్నా నాసిరకంగా నిర్మించడమే కాకుండా కనీసం క్యూరింగ్ కూడా చేయకుండా వదిలేస్తున్నారు. అనవసరమైన చోట్లుకు రియల్టర్ల కోసం మట్టిదారులు వేసుకుంటున్నారని అంటున్నారు. అధికారులు కూడా అసలు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పీఆర్ ఇంజనీర్ కూడా అన్నీ తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

గతంలో మంజూరైనా...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన రహదారులను కూడా కూటమి నేతలు తామే చేయిస్తున్నామని ప్రచారం చేసుకుంటున్నారు. ముఖ్యంగా చిలమత్తూరు మండల కేంద్రంలో రూ.90 లక్షల ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే ఈ రోడ్డు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మంజూరైంది. ఇప్పుడు నిర్మాణం చేపట్టిన టీడీపీ నాయకుడు ఎమ్మెల్యే బాలకృష్ణ మంజూరు చేయించారంటూ గొప్పలు చెప్పుకుంటుండటంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. మరికొన్ని రహదారులు కూడా నాటి ప్రభుత్వంలోనే మంజూరైనా తమ్ముళ్లు మాత్రం ఎమ్మెల్యే బాలకృష్ణనే చేయించారంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

నిధులు ఉన్నా..

లేపాక్షి మండలంలో కంచిసముద్రం రోడ్డు ప్యాచ్ వర్క్‌కు రూ.11 లక్షలు, లేపాక్షి రోడ్డుకు ప్యాచ్‌వర్క్ రూ.3.10 లక్షలు నిధులు మంజూరైన ఇంతవరకూ పనులు చేయలేదు. లేపాక్షి వయా కొండూరు రోడ్డుకు కూడా రూ.3 లక్షలు మంజూరైన పనులు జరగలేదు. లేపాక్షి వద్ద రాష్ట్ర సరిహద్దు రోడ్డులో 2 కిలోమీటర్ పనులకు రూ.5 లక్షలు విడుదలైనా పనులు లేవు.

ధాబాల్లోనే అన్నీ..

కూటమి నేతలు అధికారులకు తాయిలాలన్నీ కర్ణాటకలోని ధాబాల్లో అందజేస్తున్నట్లు తెలిసింది. నగదు చెల్లింపులు, మందు, విందు అన్నీ దాబాల్లోనే కానిచ్చేస్తున్నారని సమాచారం. కర్ణాటకలో అయితే ఎవరూ చూడరన్న ఆలోచనతో మధ్యాహ్నం అయ్యిందంటే చాలు ధాబాల్లో దర్శనమిస్తున్నారట. డ్యూటీ సమయాల్లో అధికారులు అక్కడే ఎంజాయ్ చేస్తూ కూటమి నేతల సేవల్లో తరిస్తున్నారని చెబుతున్నారు. ఉన్నతాధికారులు ఇటువైపు చూసినా ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యాలయం నుంచి ఫోన్లు చేస్తుండటంతో ఎలాంటి చర్యలు చేపట్టకుండానే వెనుదిరిగుతున్నారంటున్నారు.

క్వాలిటీ ఉంటేనే బిల్లులు

చిలమత్తూరు మండల కేంద్రంలో వేసిన బీటీ రోడ్డుకు క్వాలిటీ చెక్ చేసిన తర్వాతనే బిల్లులు మంజూరు చేశాం. ఈ రోడ్డు గత ప్రభుత్వంలోనే మంజూరైంది. ఇప్పుడు నిర్మాణం చేపట్టారు. క్వాలిటీ బాగోలేకపోతే బిల్లులు మంజూరు చేయం.

– జమాల్ బాషా, జేఈ, పంచాయతీరాజ్‌శాఖ



హిందూపురం: నాణ్యత లేని బీటీ రోడ్డు



రోడ్డు పనులకు నోచుకోని కొండూరు రోడ్డు



అధ్వానంగా ఉన్న లేపాక్షి నుంచి స్టేట్ బార్డర్ రోడ్డు



చిలమత్తూరులో వేసిన నాసిరకమైన సీసీ రోడ్డు



హిందూపురం: మున్సిపల్ ఆఫీసు రోడ్డులో నామ మాత్రంగానే వేసిన బీటీ రోడ్డు

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక



కార్యవర్గం సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం పంచాయతీరాజ్‌శాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నికలు జరిగాయి. జిల్లా అధ్యక్షుడు తిప్పేస్వామి ఆధ్వర్యంలో ఈ ఎన్నికను నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సిగ్బత్‌వుల్లా వ్యవహరించారు. పీఆర్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా హనుమంతరాయప్ప, కార్యదర్శిగా దేవానందకుమార్, అసోసియేట్ అధ్యక్షురాలిగా ద్రాక్షాయిణి, ఉపాధ్యక్షుడిగా సిద్దప్ప, సంయుక్త కార్యదర్శిగా చంద్రకళ, కోశాధికారిగా చేతన, కోఆప్షన్ సభ్యురాలిగా రాధిక, ఈసీ మెంబర్లుగా లింగరాజు, తిమ్మక్క, తిప్పేస్వామిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని జిల్లా అధ్యక్షుడు తిప్పేస్వామి, గుండుమల మాజీ సర్పంచ్ చంద్రప్ప తదితరులు సన్మానించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కల్యాణాన్ని జరిపించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలించారు.

నేడు బ్రహ్మరథోత్సవం..

రొళ్ల మండలంలోని రత్నగిరిలో వెలసిన సుబ్రహ్మణ్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మడకశిరలో సామూహిక అక్షరాభ్యాసం

మడకశిర: పట్టణంలోని షిరిడిసాయిబాబా ఆలయంలో ఆదివారం వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సరస్వతీదేవిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆ తర్వాత చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పెనుకొండ రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం లక్ష డప్పులు.. వేల గొంతులు కార్యక్రమాన్ని ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగానే ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో త్రిపురా రీసార్ట్ యజమాని డాక్టర్ గోపీనాథ్, నాయకులు రామాంజినేయులు, పెద్దన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కెంచమాంబ ఉత్సవాలు



బియ్యం తీసుకెళ్తున్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగురు గ్రామంలో వెలసిన కెంచమాంబదేవికి భక్తులు బియ్యాన్ని ఆలయానికి వితరణ చేశారు. కెంచమాంబ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన వక్కలిగ కులస్తులు బియ్యం, బేడలు, బెల్లం తదితర వాటిని ఆలయానికి సమర్పించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం రేపు

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లకొండ ఈశ్వర ఆలయ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు మండలస్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పతో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్ తదితరులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాతర ప్రారంభం



సుబ్రహ్మణ్యస్వామి

రొద్దం: మండల పరిధిలోని పెద్దమంతూరు పెన్నానది ఒడ్డున వెలసిన సుబ్రహ్మణ్యస్వామి జాతర ఘనంగా ప్రారంభమైంది. ఆదివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జాతరోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రథోత్సవం, మంగళవారం ఉట్ల జాతర నిర్వహిస్తామన్నారు.

నేటి నుంచి చౌడేశ్వరిదేవి ఉత్సవాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఉత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం అమ్మవారికి అభిషేకం, గోమాత, గంగ పూజ, రథోత్సవం, మంగళవారం జ్యోతుల ఉత్సవాలు, బుధవారం అమ్మవారి స్వస్థానం చేరుకుంటారు.

గుంతల పూడ్చివేత

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి నుంచి అమరాపురం వరకూ ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. కెంచమాంబదేవి జాతరోత్సవాలకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో ఆలయ కమిటీ సభ్యులు రోడ్డుకు మట్టి తరలించి చదును చేయించారు. ప్రభుత్వం రోడ్డుపై ఉన్న గుంతలను పట్టించుకోకపోవడంతో తమ సొంత నిధులతో రోడ్డుకు, గుంతలకు మట్టి వేసి చదును చేశారు. దీతో వాహన చోదకులు, భక్తులు ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు.

‘ఫీజు పోరు’ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, హిందూపురం సమన్వయకర్త దీపిక తదితరులు

హిందూపురం: విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 5న వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ‘ఫీజు పోరు’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, నియోజకవర్గ సమన్వయకర్త దీపిక పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఫీజుపోరుకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. సకాలంలో ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాక విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల గొంతుకగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చిందని వెల్లడించారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకూ వైఎస్సార్‌సీపీ వారి వెంట ఉండి పోరాడుతుందన్నారు.

ఘనంగా మడివాళ మాచదేవ జయంతి

పావగడ: రజకుల ఆరాధ్య దైవం మడివాళ మాచదేవ జయంతి వేడుకలు ఆదివారం తాలూకా కార్యాలయంలో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వరదరాజు మాచదేవ చిత్రపటం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రామాంజినప్ప, మడివాళ మాచదేవ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామప్ప, కార్యదర్శి రాము, గంగాధర్, కిరణ్, మధుసూదన్, రైతు సంఘం నాయకుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి ఆలయంలో పర్యాటకుల సందడి



జరాయువు పక్షి వద్ద పర్యాటకులు



నంది పార్కులోని కోనేరు వద్ద సందడి

లేపాక్షి: మండల కేంద్రం లేపాక్షిలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ఇక్కడి ప్రముఖ ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించడానికి ఎగబడ్డారు. ఈ సందర్భంగా దుర్గాదేవి, వీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం అభిషేకార్చనలు, తీర్థ ప్రసాద వినియోగాలు, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

హిందూపురం టౌన్: పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ రోజుల్లో జరిగిన మధుర స్మృతులను వారు గుర్తుచేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం నాడు తమకు విద్యా బుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆటపాటలతో గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, బాలాజీ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన 10 శాతం మద్యం షాపులకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైనట్లు హిందూపురం ఎక్సైజ్ సీఐ రామ్మోహన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివరాలను సీఐ వెల్లడించారు. హిందూపురం మున్సిపాలిటీకి ఒకటి, రూరల్ మండలానికి ఒకటి, చిలమత్తూరు మండలానికి ఒకటి చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు నోటిఫికేషన్‌లో పొందుపరిచిన అన్ని వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాల కోసం హిందూపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

మడకశిర: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు పట్టణ సీఐ రాగిరిరామయ్య కౌన్సిలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తన కలిగి జీవించాలని, సూచించారు. ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మడకశిర మండలంలోని రౌడీ షీటర్లందరూ కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9912220726